క్లుప్తంగా

50వ రోజుకు చేరిన రిలే దీక్ష



మరికల్: చిత్తనూర్ శివారులో ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా నిర్మిస్తున్న ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరవధిక దీక్ష శనివారం 50వ రోజుకు చేరుకుంది. శిబిరంలో రైతులు మాట్లాడుతూ పచ్చని పంట పొలాలను నాశనం చేసే ప్రమాదకరమైన కంపెనీ రద్దు చేసే వరకు తమ ఆందోళన కొనసాగుతుందన్నారు. ఆదివారం కంపెనీ ఎదుట భారీ ఎత్తున ధర్నా నిర్వహిస్తున్నట్లు కంపెని వ్యతిరేక పోరాట కమిటీ సభ్యుడు లక్ష్మయ్య తెలిపారు.

పంచాయతీకి స్థలం ఇస్తామని వినతి



ధన్వాడ: మండలంలోని కిష్టాపూర్‌లో సర్వే నంబర్ 65లో గల 23 గుంటల పంట భూమిని పంచాయతీ భవన నిర్మాణం కోసం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానంటూ పారుబాయి శనివారం ఎంపీడీఓ సద్గుణకు వినతిపత్రం అందజేశారు. రోడ్డుకు పక్కనే ఉన్నందున్న పంచాయతీ భవనంకు అనువుగా ఉంటుందని గ్రామానికి వచ్చి పరిశీలించాలని కోరారు.

దోమల నివారణకు చర్యలు



ధన్వాడ: మండలంలోని కొండాపూర్‌లో ఉన్న గిరిజన గురుకులంలో శనివారం దోమల నివారణకు చర్యలు చేపట్టినట్లు జిల్లా మలేరియా అధికారి అశోక్‌కుమార్ తెలిపారు. గురుకులంలోని విద్యార్థులకు దోమల వల్ల మలేరియా వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తగా తరగతి, వసతి గదులు, భోజనశాల పరిసరాలలో మందును పిచికారీ చేశామని తెలిపారు.

వాల్‌పోస్టర్ విడుదల



నారాయణపేట: వీరబద్రీయా (వీర ముష్టి) సంఘం స్వర్ణోత్సవ వాల్‌పోస్టర్‌ను శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు విడుదల చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సారంగి భీమేష్ మాట్లాడుతూ సంఘం ఏర్పాటై 50 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 21న సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేడుకలకు సమాజం సభ్యులు పెద్ద సంఖ్యలో హజరు కావాలని కోరారు. కార్యక్రమంలో గందెచంద్రకాంత్, చెన్నారెడ్డి, జొన్నల సుభాష్, సురేందర్‌రెడ్డి, బొబ్బిలి భీమేష్, రాములు పాల్గొన్నారు.

బీఎస్పీ కమిటీ ఎన్నిక



మద్దూరు: కొత్తపల్లి మండలంలోని పెద్దపూర్‌లో బీఎస్పీ కమిటీని శనివారం కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నర్మద ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాలయ్య, ఉపాధ్యక్షుడిగా కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, కార్యదర్శులుగా పలువురుని ఎన్నుకున్నారు. రాష్ట్రంలో దళిత, బడుగు, బలహీన, అగ్రవర్ణాల పేదల పక్షాన పోరాటం చేస్తున్న వ్యక్తి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ తరపున పోరాటం చేసి బడుగు, బలహీన వర్గాల రాజ్యం తీసుకొద్దమన్నారు. అనంతరం ఎన్నికైన వారికి నియామక పత్రాలను అందజేశారు.

రేపు ధర్మ సమాజ్ పార్టీ ఆవిర్భావ సభ

నారాయణపేట: ధర్మసమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు జిల్లా కేంద్రంలోని శీలా గార్డెన్‌లో పార్టీ ఆవిర్భవ సభ ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రచార కమిటీ సభ్యుడు పోర్ల డేవిడ్ శనివారం తెలిపారు. వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ హాజరవుతారని, జిల్లాలోని అన్ని మండలా ల నుంచి సభకు పెద్ద ఎత్తున బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సభకు సంబంధించిన వాల్ స్టిక్కర్‌ను విడుదల చేశారు. నాయకులు ఈశ్వర్, గోపాల కృష్ణ, వేణు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

అన్ని వసతులతో ప్రభుత్వ ఆస్పత్రి



మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఎస్‌బీఎస్‌యూ యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్: సీఎం కేసీఆర్ హయంలోనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని వసతులు కల్పించినట్లు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఎన్‌బీఎస్‌యూ యూనిట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కేంద్రం ప్రత్యేకంగా పుట్టిన పిల్లలకు మాత్రమే అవసరం ఉంటుందని తెలిపారు. ఆయన నియోజకవర్గానికి 150 పడకల ఆస్పత్రి మంజూరైందన్నారు. స్థల పరిశీలన పూర్తయ్యిందని త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు.

విద్యార్థులకు అభినందన

రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొనేందుకు ఎంపికైన బీసీ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులను శనివారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి శాలువాతో సన్మానించారు.

గ్రామాభివృద్ధే ధ్యేయం

ఊట్కూర్: గ్రామాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నిడుగుర్తిలో రైతువేదిక ప్రారంభోత్సవం, అంగన్‌వాడీ భవనానికి భూమిపూజ, కొల్లూర్‌లో బీసీ కమ్యూనిటీ భవనానికి భూమి పూజ, చిన్నపొర్లలో ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, గొర్రెల కాపరులకు రెండవ విడత గొర్రెల పంపిణీ చేపట్టారు.

గొర్రెల కాపారులు ఆర్థికంగా ఎదగాలి

మరికల్: ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ గొర్రెలతో గొల్ల, కురుమ యాదవులు ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిత్తనూర్‌లో లబ్ధిదారులకు శనివారం రెండో విడత గొర్రెలను అందజేశారు. కార్యక్రమంలో రఘునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



మద్దూరులో జల్ది ఊరేగింపు చేపడుతున్న గ్రామస్తులు

మద్దూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో మొదటి శ్రావణమాస శనివార వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. కాచువాగు ఆంజనేయ స్వామి ఉత్సవాల సందర్భంగా జల్ది ఊరేగింపు చేపట్టారు. అనంతరం స్వామికి పంచామృతభిషేకం పూజలు రాఘవేంద్రచారి చేశారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేశారు. రెనివట్లలో ఉదయం నుంచి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, సాయంత్రం గ్రామంలో జల్ది ఊరేగింపు గ్రామ పెద్దల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.

ఘనంగా శ్రావణం పూజలు

మరికల్: మండల కేంద్రంలోని పడమటి ఆంజనేయస్వామి ఆలయం వద్ద శ్రావణమాసం మొదటి శనివారం కావడంతో భక్తులు ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పూజారి వెంకటేశ్వర్లశర్మ స్వామి వారికి జల, పంచామృతాభిషేకం చేసి అలంకరించి భక్తులకు తీర్థప్రసాదలను అందజేశారు.

సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

నారాయణపేట రూరల్: పట్టణంలోని వివిధ దేవాలయాల్లో శనివారం సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. మోచివాడ శివాలయం, గొడుగుగేరి, గాంధీ నగర్, పళ్ల హనుమాన్ మందిరాలలో ఓంకారం కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి హారతి చేశారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



కృష్ణా: మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాయలంలో ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ఉచిత నోట్ బుక్స్‌ను శనివారం క్లస్టర్ హెచ్‌ఎం నిజాముద్దీన్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు వారికి అవసరమయ్యే అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నరేష్‌గౌడ్, అమీన్ రెడ్డి, రమేష్, నాగేష్ పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి



మద్దూరు: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను, ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట విద్యార్థులు ధర్నా చేపట్టారు. పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీహరి మాట్లాడుతూ.. రూ.5,500 కోట్ల స్కాలర్‌షిప్ బకాయిలు ఉన్నాయన్నారు. రాష్ట్రంలో హాస్టల్స్, గురుకులాలు సంక్షోభంలో ఉన్నాయని ప్రభుత్వ విద్యను నీరుగార్చి, కార్పొరేట్ విద్యా సంస్థలకు మేలు చేకూర్చేలా వ్యవహరిస్తుందన్నారు. జిల్లా కేంద్రంలో పీజీ సెంటర్, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని కార్యాలయ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో విజయ్, అశోక్, అంజి, రమేష్, లాలు తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎంపిక

నారాయణపేట రూరల్: తెలుగుదేశం పార్టీ మండల కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గోపాల్‌రెడ్డి పలువురు సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో వినయమిత్ర, యాబన్నచౌద్రి, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల భాగస్వామ్యం తప్పనిసరి



మాగనూరులో మాట్లాడుతున్న హెచ్‌ఎం

మాగనూర్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో తల్లిదండ్రులను భాగస్వామ్యం తప్పనిసరి అవసరమని మండల ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శివరాజ్ తెలిపారు. శనివారం తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. విద్యార్థుల హాజరు, ప్రవర్తన, చదువుపై చర్చ, పరీక్ష ఫలితాలు, మధ్యాహ్న భోజనం అమలు తీరుపై చర్చించారు.

ఇంటి వద్ద అభ్యాసనకు అనువైనది

నర్వ: విద్యార్థులకు ఇంటి వద్ద అభ్యాసనకు అనువైన వాతావరణం ఉంటుందని సీపూర్ పాఠశాల హెచ్‌ఎం ఉస్మాన్ అన్నారు. శనివారం పెద్దకడ్మూర్, సీపూర్, కల్వాల్, నర్వ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. 45 రోజుల ప్రణాళిక అమలును ఉపాధ్యాయులతో పాటు ఇంటి వద్ద తల్లిదండ్రులు చేయిస్తే విద్యార్థుల్లో సామర్థ్యాలను రాబట్టవచ్చాన్నారు.

ఊట్కూరు: మండలంలోని చిన్నపొర్ల ఉన్నత పాఠశాలలో పగిడిమారి ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం నర్సింహ, గురునాథ్ పాల్గొన్నారు.

నారాయణపేట రూరల్: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ఉపాధ్యాయుల కృషికి పిల్లల తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని సెక్టోరియల్ అధికారులు రాజేంద్రకుమార్, నాగార్జున్‌రెడ్డి అన్నారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల్లో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం



మాట్లాడుతున్న సాయికుమార్

నారాయణపేట రూరల్: విద్యారంగ సమస్యలపై పోరాడుతామని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ అన్నారు. పట్టణంలోని భగత్‌సింగ్ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం విద్యారంగంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, ఉమ్మడి రాష్ట్రంలో కంటే తక్కువ నిధులు కేటాయిస్తూ నిర్వీర్యానికి కుట్ర పన్నుతుందని విమర్శించారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రానికి మహిళా జూనియర్, డిగ్రీ కళాశాల మంజూరు, పీజీ సెంటర్ ఏర్పాటు చేయాలని, హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. విద్యాసంస్థల్లోకి మీడియా, సంఘాల రాకను నిషేదిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులను అన్ని గ్రామాలకు తగిన సమయానికి నడిపించాలని కోరారు. ఖాళీ పోస్టుల భర్తీతో ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేయాలన్నారు. లేకపోతే ఈ నెల 21న కలెక్టరేట్‌ల ముట్టడి చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో భాస్కర్, బాలు, వెంకటేష్, మహేష్, అంజి, మహిపాల్, అజర్, శ్యామ్, శివ, ఆనంద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు తగవు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మరికల్: ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారని, ఇది తెలియని కాంగ్రెస్ నాయకుడు హర్షవర్ధన్‌రెడ్డి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిపై ఆరోపణాలు చేయడం తగదని బీఆర్ఎస్ నాయకులు తిరుపతయ్య, రాజేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో వారు మాట్లాడారు. నియోజకవర్గంలో మెడికల్ కళాశాల, ధన్వాడకు డిగ్రీ కళాశాల మంజూరు చేయించిన ఘనత ఎమ్మెల్యేకు దక్కిందన్నారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో చేసిన అభివృద్ధి ఏమి లేదన్నారు. 9ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని నిరుపించడానికి సిద్ధంగా ఉన్నామని, కాంగ్రెస్ చేసిన అభివృద్ధి ఏమిటో నిరూపించేందుకు బహిరంగ చర్చకు సిద్ధమంటూ ఆయనకు సవాల్ విసిరారు. మరోసారి ఎమ్మెల్యేపై ఆరోపణాలు చేస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బసంత్, శేఖర్, రాజేందర్‌గౌడ్, రామస్వామి, గోపాల్, రవి, కృష్ణయ్య, నారాయణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

పర్వతారోహకురాలు పూర్ణ మాలావత్ రాక

మాగనూర్: పశ్చిమాద్రి విరక్త మఠంకు భారతీయ పర్వతారోహకురాలు పూర్ణ మాలావత్ ఈ నెల 30న రానున్నట్లు పంచమ సిద్ధలింగ మహాస్వాములు శనివారం ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 2022–23 విద్యాసంవత్సరానికి ప్రతి మండలంలో పదో తరగతి, ఇంటర్ ప్రథమ, ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు, ఎస్ఐ పరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు నేరడగంలో గల పశ్చిమాద్రి విరక్త మఠంలో ప్రతిభ పురస్కారాలు ప్రధాన కార్యక్రమం ఉదయం 10 గంటలకు ఉంటుందని తెలిపారు. అతిచిన్న వయస్సులో ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన పూర్ణమాలవత్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి విద్యావేత్తలు, విద్యాభిమానులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

'గృహలక్ష్మి' దరఖాస్తుల పరిశీలన



కృష్ణా: మండలంలోని ముడుమాల్‌లో శనివారం ఎంపీడీఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గృహలక్ష్మి పథకం దరఖాస్తులు చేసుకున్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలించారు. ప్రధానంగా వారి పరిస్థితి, ఖాళీ స్థలంతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన సూచనల ప్రకారంగా ఉన్నాయా? లేదా అనే విషయాలను పరిశీలించినట్లు వారు తెలిపారు.

మక్తల్: మండంలోని పలు గ్రామాల్లో ఎంపీడీఓ శ్రీధర్, ఎంపీఈ పావనీ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి గృహలక్ష్మి పథకం దరఖాస్తులను ఇంటి వద్ద స్థలం, పూరి గుడిసె, రేకుల షెడ్డు ఉన్న వాటిని పరిశీలించారు. పూర్తి చిరునామా, ఆధార్‌కార్డు, ఓటర్ కార్డును తనిఖీ చేశారు. మండలంలో 3,200 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. సోమవారం వరకు పరిశీలన పూర్తి చేస్తామన్నారు.

రెండో ఏఎన్ఎంలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

నారాయణపేట: ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఏఎన్ఎంల పాత్ర కీలకమైందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు వద్ద రెండో ఏఎన్ఎంలు చేస్తున్న సమ్మె శనివారం నాటికి నాల్గవ రోజుకు చేరుకుంది. ఆయన మాట్లాడుతూ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాద బీమా రూ.50 లక్షలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సబిత, రాణి, సుమిత్ర, అనసూయ, వెంకటేశ్వరమ్మ, చంద్రకళ, భారతి, వరలక్ష్మి, గిరిజ, శోభ, దేవిక, సుజాత, రామేశ్వరి, అనురాధ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాల పరిశీలన



కోస్గి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో శనివారం తహసీల్దార్ శ్రీనివాసులు పట్టణంలోని పది పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అక్కడ మౌలిక వసతుల ఏర్పాటుకు చేయాల్సిన పనులు సిబ్బందికి సూచించారు. ఈయన వెంట సుభాష్‌రెడ్డి, బీఎల్ఓలు పాల్గొన్నారు.

తోగాపూర్‌లో తాగునీటి ఎద్దడి



కోస్గి: మండలంలోని తోగాపూర్‌లో మూడు రోజులుగా తాగునీటి సరఫరా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రావణమాసం ఆరంభం కావడంతో ఇళ్లను, ప్రాంతాలను శుభ్రం చేసుకోవడానికి నీళ్లు అవసరం ఉండడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. నీటి కోసం బోరుమోటార్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.

కలెక్టరేట్ ముట్టడి విజయవంతం చేద్దాం



నారాయణపేట రూరల్: విద్యారంగ సమస్యల సాధనకు ఈ నెల 21న నిర్వహించ తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడి విజయవంతం చేద్దామని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరహరి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని వాల్‌పోస్టర్ విడుదల చేశారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని, విద్యాసంస్థల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలని, సంక్షేమ హాస్టళ్లలో సౌకర్యాలు కల్పించి కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. సమస్యల సాధనకు చేస్తున్న కార్యక్రమానికి విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో అజయ్, పవన్, శ్యామల, విష్ణు, విజయ్, నవీన, గోవర్ధన్, బాలరాజు పాల్గొన్నారు.

29న క్రికెట్ టోర్నీ

నారాయణపేట రూరల్: జాతీయ క్రీడాదినోత్సవం పురస్కరించుకుని అథ్లెటిక్స్ అసోసియేషన్, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం సంయుక్తంగా పాఠశాల విద్యార్థులకు క్రికెట్ పోటీలను ఏర్పాటు చేసింది. శనివారం సాయంత్రం మినీ స్టేడియం గ్రౌండ్‌లో 22 జట్లకు సంబంధించి రెండు విభాగాల వారీగా డ్రా తీశారు. సోమవారం నుంచి పోటీలను ప్రారంభించి ఈ నెల 29న విజేతలకు ట్రోఫీల బహూకరణ చేపడుతామని నిర్వాహకుడు రమణ తెలిపారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం

నర్వ: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మండల కేంద్రంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, అశోక్‌యాదవ్, వీరేష్ చారి, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా దాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. స్థానిక సీనియర్ ఫొటోగ్రాఫర్లు అశోక్‌చౌదర్, గురునాథ్, రాము, శంకర్, నవీన్‌కుమార్‌లను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీ హన్మంతు, వసంత్‌కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: పట్టణంలో ప్రొఫెషనల్ ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పడమటి ఆంజనేయస్వామి దేవాలయం వద్ద లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. ప్రభుత్వం ఫొటోగ్రాఫర్ల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, పాపిరెడ్డి, వెంకటేష్, నరేష్, తిరుపతి, గోవిందు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మరికల్: మండల కేంద్రంలోని చౌరస్తాలో శనివారం ఘనంగా ఫొటోగ్రాఫర్లు స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో నరేష్, జగన్, విజయ్, ఆనంద్‌భాస్కర్, శేఖర్, రవి, యాదయ్య, కృష్ణ పాల్గొన్నారు.

కోస్గి: పట్టణ ఫొటోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో హన్మంతు, కృష్ణయ్య, వాహిద్, శ్రీకాంత్, గాయిత్రి పాల్గొన్నారు.



కోస్గిలో పండ్లు పంపిణీ చేస్తున్న ఫొటోగ్రాఫర్లు



నర్వలో..



మక్తల్‌లో..



మరికల్‌లో..

పరామర్శ

కృష్ణా: కున్సికి చెందిన ఎరుకలి బస్వరాజ్ రెండు రోజుల కిందట రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆ కుటుంబాన్ని శనివారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆ కుటుంబానికి ఆధారమైన వ్యక్తి మృతిచెందడంతో ఆ కుటుంబాన్ని అన్ని రకాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈయన వెంట సిద్ధప్ప, అంజప్పగౌడ్, శివ, అన్వర్‌పాష, శ్రీనివాసులు ఉన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ చూపాలి

మాగనూర్: తరగతి గదిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ కోయశ్రీహర్ష శనివారం జూమ్ మీటింగ్‌లో ఉమ్మడి మాగనూర్, కృష్ణ మండలంలోని మొత్తం 174 మంది ఉపాధ్యాయులకు సూచించినట్లు నోడల్ అధికారి వెంకటయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి, ప్రార్థన సమయానికి హాజరుకావాలని సూచించారు. వెలుగు నోట్ బుక్స్ ద్వారా ప్రతిరోజు హోంవర్క్ చూచిరాత ఇచ్చి వాటిని మరుసటి రోజు సరిదిద్దాలని అన్నారు. మొదటి 45నిమిషాలు టీఎల్ఎం బోధించాలని తెలిపారు. ఉజ్జెల్లి, అల్లంపల్లి, గుడేబల్లూర్ పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేకమైన టీఎల్ఎం తయారు చేసి సీ గ్రేడ్ విద్యార్థుల కోసం ప్రత్యేకమైన తరగతులు నిర్వహిస్తున్నందుకు వారిని కలెక్టర్ అభినందించినట్లు తెలిపారు. కొత్తపల్లి పాఠశాలలో ప్రహరీ గోడ నిర్మాణం పనులు ఎంతవరకు వచ్చాయని పాఠశాల హెచ్‌ఎం దుబ్బన్నను అడుగగా పనులు కొనసాగుతున్నట్లు సమాధానం ఇచ్చారు.

విహారయాత్రకు విద్యార్థులు

మరికల్: పదో తరగతి ఫలితాల్లో పది జీపీఏ సాధించిన విద్యార్థులను నర్వ మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి విహారయాత్రకు తీసుకెళ్లారు. మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలో నలుగురు విద్యార్థులు పది జీపీఏ సాధించడంతో వారిని శనివారం శంషాబాద్ విమానాశ్రయంలో హైదరాబాద్ నుంచి చెన్నైకి విమానంలో తీసుకెళ్లారు. మంచి గ్రేడ్‌తో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను వరుసగా మూడో సారి విహారయాత్రకు తీసుకెళ్లామన్నారు. ప్రతి ఏడాది పరీక్షలకు ముందే ఈ విషయాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలకు తెలుపుతున్నామన్నారు.